క్లుప్తంగా

ఘనంగా లక్ష కుంకుమార్చన



పామర్రు: శ్రావణ మాసం చివరి ఆదివారం కావడంతో స్థానిక విజయవాడ రోడ్డులోని బుచ్చిమ్మతల్లి ఆశ్రమంలోని రామలింగేశ్వర స్వామి సమేత పర్వత వర్ధనీ దేవి ఆలయంలో అమ్మవారికి లక్ష కుంకుమ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారిని పంచామృతాలతో నవరసాలతో, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పసుపు కుంకుమలతో స్నపన కార్యక్రమాలను చేశారు. ఆలయ ప్రాంగణంలో సుమారు 20 మంది రుత్విక్కులచే అమ్మవారికి లక్ష కుంకుమ పూజ చేశారు. కొమ్ముకూరు కనక సుందరశర్మ, కొమ్ముకూరు కార్తీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

కొండలమ్మకు మొక్కుబడుల చెల్లింపు

గుడ్లవల్లేరు: కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులను చెల్లించుకునేందుకు ఆలయంలో ఆదివారం క్యూలైనుల్లో భక్తులు అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.

ముగిసిన ఉత్సవాలు



గుడివాడ టౌన్: స్థానిక మార్కెట్ సెంటర్‌లో శ్రీకృష్ణ ఆలయంలో వార్షికోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీకృష్ణుని విగ్రహాన్ని పట్టణ పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కృష్ణభగవాన్ ఊరేగింపు కొనసాగింది. స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి శివసుబ్రహ్మణ్యేశ్వరరావు (చంటి) పూజా కార్యక్రమంలో పాల్గొని ఊరేగింపును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ జ్యోతుల సత్యవేణి, ఆలయ నిర్వాహకులు జ్యోతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

85 మందికి వైద్య సేవలు

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 85 మంది రోగులకు గుడివాడ వైద్యురాలు డాక్టర్ గవిర్నేని రజిని వైద్య పరీక్షలు చేశారని లయన్స్ చైర్మన్ నాగేశ్వరరావు తెలిపారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశామని పేర్కొన్నారు.

వర్గీకరణ బిల్లు ఆమోదించాలని దీక్ష



పమిడిముక్కల: ఎస్సీ వర్గీకరణ బిల్లును ఈ నెల 18 నుంచి జరగబోయే పార్లమెంట్ అత్యవసర సమావేశంలో ప్రవేశపెట్టి ఆమోదించే బాధ్యతను బీజేపీ తీసుకోవాలని మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ) నాయకులు డిమాండ్ చేశారు. బిల్లు ప్రవేశపెట్టి మాదిగలకు న్యాయం చేయాలని కోరుతూ మండల కన్వీనర్ వేల్పూరి మధు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం నిరసన దీక్షను చేపట్టారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా నాయకులు పేటేటి ప్రభాకర్, సిద్దల జయరాజ్, నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ కన్వీనర్ కొల్లూరి దినేష్ తదితరులు పాల్గొన్నారు.

నవగ్రహ మండప నిర్మాణానికి భూమి పూజ



గూడూరు: స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయంలో నవగ్రహ మండప నిర్మాణానికి ఎంపీపీ సంగా మధుసూదనరావు ఆదివారం భూమి పూజ నిర్వహించారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ చొరవతో నవగ్రహ మండప నిర్మాణం, ఆలయం మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.30 లక్షలు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో వేద పండితుల మంత్రాల నడుమ ఎంపీపీ మధుసూదనరావు, రైల్వే బోర్డు మెంబరు మోటేపల్లి రత్నారావు దంపతులచే మండపం నిర్మాణానికి శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో గూడూరు పీఏసీఎస్ డైరెక్టర్ ఆకూరి శ్రీనివాసరావు, ఆలయ మేనేజర్ టీవీవీ మోహనరావు, పి. అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల ప్రోత్సాహానికి క్లబ్ కృషి భేష్

- గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని
- గుడివాడ క్లబ్ స్థాపించి నూరు వసంతాలు పూర్తి
- జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్ పోటీలు
- విజేతలకు బహుమతులు అదజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: ది గుడివాడ క్లబ్ (ఆఫీసర్స్ క్లబ్) క్రీడలకు ప్రోత్సాహాన్ని అందించడం అభినందనీయమని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. ఆదివారం ఆఫీసర్స్ క్లబ్ నూరు వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా జరిగిన జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. క్లబ్ ఆధ్వర్యంలో బ్రిడ్జి గేమ్‌లో అంతర్జాతీయ స్థాయి పోటీలలో అనేక సార్లు ప్రథమస్థానం చేజిక్కించుకుందన్నారు. మరిన్ని క్రీడలను క్లబ్ ప్రోత్సహించాలన్నారు. క్లబ్‌లో సేవలందిస్తూ ఇటీవల మృతిచెందిన ఓ ఉద్యోగి కుటుంబానికి క్లబ్ రూ.50 వేలు వితరణగా అందజేశారు. ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా మొత్తం 36 టీములు పాల్గొన్నాయి. మొదటి బహుమతి రూ.10 వేలు జి.దిలీప్ కుమార్, పి.షమీర్ ఖాన్ (గుడివాడ క్లబ్), రెండో బహుమతి రూ.7 వేలు ఎం.ప్రతాప్ కుమార్, ఎస్.పోతురాజు (గుడివాడ), మూడో బహుమతి రూ.5 వేలు, పి. రాజశేఖర్, బి.హర్ష (విజయవాడ), నాల్గవ బహుమతి రూ.3 వేలు పి శేఖరరెడ్డి, డి.రవికిరణ్ (గుడివాడ క్లబ్)లకు నగదు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ పి.పద్మావతి, క్లబ్ ఉపాధ్యక్షుడు గుత్తా నాని, కార్యదర్శి చింతపల్లి ప్రసాదు, కోశాధికారి అడపా జగదీష్ (పండు), సభ్యులు పల్లపోతు రమేష్, కంటిపూడి రవికుమార్, కట్టా రాంబాబు, గుమ్మడి పార్థసారథి, కఠారి రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు శ్రీకారం



ఆటపాకలో చవితి ఉత్సవ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: వినాయక చవితి ఉత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. ఆటపాకలో చవితి పందిరిరాట కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పాల్గొన్నారు. ఐక్యంగా భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్నా రమేష్, సింగంశెట్టి రాము, వద్లాని సుబ్బయ్య, కన్నా బాబు, వద్లాని శివరామకృష్ణ, కన్నా ప్రసాదు, సిద్ధ బత్తుల శ్రీరామమూర్తి, పిచ్చేటి మహేష్, కన్నా శ్రీకాంత్, వేల్పూరి ప్రసాద్ పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌కు ఎస్సీ కమిషన్ చైర్మన్ అభినందన



నాగమణి, విక్టర్ దంపతులను అభినందిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

గుడివాడరూరల్: గుడివాడ మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్‌గా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన మట్టా నాగమణి విక్టర్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జాన్‌విక్టర్ దంపతులను ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అభినందించారు. మండలంలోని లింగవరం గ్రామంలో ఆదివారం సాయంత్రం మట్టా నాగమణి విక్టర్ దంపతులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెనుకబడిన వర్గాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. గత ప్రభుత్వాల హయాంలో మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ పదవులు ఎస్సీయేతరులకు కట్టబెట్టారన్నారు. ఆ చరిత్ర తిరగరాస్తూ ప్రస్తుత ప్రభుత్వం గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిని ఎస్సీలకు కేటాయించిందన్నారు. అనంతరం నాగమణి, విక్టర్ దంపతులను ఘనంగా మారుమూడి సత్కరించారు. రైతుల సంక్షేమానికి కృషి చేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు.

500 మందికి వైద్య పరీక్షలు

యలమర్రు(పెదపారుపూడి): గ్రామీణ ప్రాంతంలో అమరావతి సేవా సమితి చేస్తున్న వైద్య సేవలు అభినందనీయమని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. మండలంలోని యలమర్రులో ఆదివారం అమరావతి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవా సంస్థ ద్వారా గ్రామంలో వైద్యం, విద్య అభివృద్ధికి చేస్తున్న సేవలు మరవలేనివన్నారు. మణిపాల్ వైద్యులు గుండె, క్యాన్సర్, ఆర్థోపెడిక్‌కు సంబంధించి 500 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అమరావతి సేవా సంస్థ నిర్వహకులు అట్లూరి శ్రీనివాసరావు, సూరపనేని సత్యనాయరణ, మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సేవా సంస్థ ద్వారా మరిన్ని వైద్య సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొల్లూరి అనూష, సుంకర రమేష్, చెరుకూరి రమేష్, చేరుకూరి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు వేగవంతం

అధికారులకు ఎమ్మెల్యే పార్థసారథి ఆదేశం



కానూరు సనత్‌నగర్‌లో డ్రైనేజీ నిర్మాణం పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: సనత్‌నగర్‌లో నిర్మాణం చేస్తున్న డ్రెయినేజీ పనులు వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని కానూరు సనత్‌నగర్‌లో రూ.50 లక్షలతో ప్రధాన డ్రెయినేజీ నిర్మాణ పనులు ఇటీవల ప్రారంభించారు. అయితే వర్షం కురవడంతో డ్రెయినేజీ నీరు సనత్‌నగర్ నుంచి తులసీనగర్ వద్దకు వచ్చి నిలిచిపోయాయి. ఆదివారం ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సనత్‌నగర్‌కు వచ్చి పరిశీలించారు. గత ప్రభుత్వ పాలనలో సనత్‌నగర్ అభివృద్ధిపై పూర్తిగా నిర్లక్ష్యం చూపారని, ఈ కారణంగా సనత్‌నగర్‌లో కనీస వసతులు లేకుండా ఉన్నాయన్నారు. తమ హయాంలో అనేక అంతర్గత రోడ్లను నిర్మించామన్నారు. ప్రధాన డ్రెయినేజీ నిర్మాణం చేసి సనత్‌నగర్‌లో శాశ్వతంగా మురుగునీరు సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. డ్రెయినేజీ నిర్మాణం చేస్తున్న సమయంలో వర్షం కురవటంతో పనులకు ఆటంకం కలిగిందని తెలిపారు. డ్రెయినేజీ నిర్మాణం పనులు వేగంగా చేయాలని అధికారులను ఆదేశించారు. వైఎస్సార్ సీపీ నేతలు చాంద్‌బాషా, అబ్దుల్ రెహమాన్, పఠాన్ అహ్మద్, అజీజుల్లా, సిద్ధిక్ పాల్గొన్నారు.

ముందస్తు భద్రత చర్యలు

గన్నవరం: స్కిల్ డవలప్‌మెంట్ కుంభకోణం కేసులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కోర్టు రిమాండ్ విధించిన నేపథ్యంలో పోలీసులు ముందస్తు భద్రత చర్యలు చేపట్టారు. టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగుతారనే సమాచారం మేరకు జాతీయ రహదారిపై పలు కూడళ్లలో బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక గాంధీచౌక్, సినిమా హాల్ సెంటర్, బస్టాండ్ వద్ద పోలీసులను భారీగా మోహరించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

ప్రభు కుమారికి సన్మానం



ప్రభుకుమారిని సన్మానించిన రోజారాణి, జీవన్‌రాజు, సంఘస్తులు

నాగాయలంక: దక్షిణ కొరియాకు చెందిన ఛాంగ్ హువాంగ్ హోంగ్ చర్చి డయాసిస్ యూనివర్సిటీ డాక్టర్ ఆఫ్ డివైనిటీ పట్టా పొందిన స్థానిక షెకీనా మినిస్ట్రీస్ నిర్వాహకురాలు పూషడపు ప్రభుకుమారిని ఆదివారం ఘనంగా సన్మానించారు. ఇటీవల కృత్తివెన్ను మండలం నిడమర్రులోని యూనివర్సిటీ చర్చి డయాసిస్ సంస్థలో బిషప్ రాజాబాబు చేతుల మీదుగా యూనివర్సిటీ అధికారిక డాక్టరేట్ పట్టాను ఆమె అందుకున్నారు. డాక్టరేట్ పురస్కారం నేపథ్యంలో సంస్థ ప్రాంగణంలో ఆదివారం మినిస్ట్రీస్ సభ్యులు, మండలంలోని దైవజనుల ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు.
ఈ సందర్భంగా ప్రభుకుమారిని ఘనంగా సత్కరించిన సంఘస్తులు ఆమెకు లక్షన్నర రూపాయలు కానుకగా బహుకరించారు. చర్చి సంఘ పెద్దలు గుడివాక జీవన్‌రాజు, సింహాద్రి రోజారాణి పర్యవేక్షించారు. కార్యక్రమంలో దైవజనులు, సేవకులు పాల్గొని ఆమె అందిస్తున్న దైవత్వ సేవలను కొనియాడారు.

నేటి నుంచి కార్యదర్శులకు శిక్షణ

విజయవాడరూరల్: జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రూరల్ మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు మూడవ బ్యాచ్‌కు సోమవారం నుంచి 16వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. నున్న సచివాలయం 2,3 గ్రేడు 5 కార్యదర్శులు, పి.నైనవరం, పైడూరుపాడు, పాతపాడు, ప్రసాదంపాడు 2,3, రామవరప్పాడు 2,3, 5, రాయనపాడు గ్రామాల గ్రేడు 5 కార్యదర్శులకు శిక్షణ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గత రెండు బ్యాచ్‌లకు జరిగిన ట్రైనింగ్ క్లాసులకు హాజరుకాలేని వారు ఈ శిక్షణకు రావచ్చన్నారు. గుణదలలోని సోషల్ సర్వీసు సెంటర్లో 6 రోజుల పాటు రోజూ ఉదయం 9 గంటల నుంచే ప్రారంభమవుతాయన్నారు.

మాజీ సైనికులకు ఉచిత దంత వైద్య సేవలు

మచిలీపట్నంటౌన్: ప్రభుత్వం అమలు చేస్తున్న ఎక్స్ సర్వీస్‌మెన్ కాంట్రిబ్యూటరీ హెల్త్ స్కీం ద్వారా మాజీ సైనికులు దంత వైద్య సేవలను ఉచితంగా పొందవచ్చునని విజయవాడ ఈసీహెచ్‌ఎస్ పాలీక్లినిక్ ఇన్‌చార్జి మాజీ కల్నల్ ఎస్ రావు అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా కోర్టు సెంటర్‌లోని అన్నపూర్ణ ఇంటర్నేషనల్ డెంటల్ హాస్పటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మాజీ సైనికులకు ఈసీహెచ్‌ఎస్ పథకం ద్వారా ఉచిత వైద్యసేవలు అందిస్తోందన్నారు. మచిలీపట్నంలోని అన్నపూర్ణ ఇంటర్నేషనల్ డెంటల్ హాస్పటల్‌కు ఈసీహెచ్‌ఎస్ న్యూ ఢిల్లీ వారు ఉచిత వైద్య సేవలకు అనుమతులు ఇచ్చారన్నారు. అందువల్ల మాజీ సైనికులు ఈ ఆస్పత్రిలో ఈ పథకం ద్వారా ఉచిత దంత వైద్యసేవలు పొందాలని చెప్పారు. హాస్పటల్ డైరెక్టర్ రంగనాథ్, మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు వసంతరావు, పెడన మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు అబ్దుల్ సలాం, మాజీ సైనికులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

పెనమలూరు: పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న దాదాపు 60 మంది రౌడీషీటర్లను పోలీస్‌స్టేషన్‌కు పోలీసులు పిలిచారు. రౌడీషీటర్ల రోజువారీ దిన చర్యల వివరాలు పోలీసులు తెలుసుకున్నారు. క్రమశిక్షణతో మెలగాలని ఇన్‌చార్జ్ సీఐ వాసంశెట్టి శ్రీనివాసరావు ఉపదేశించారు. ఇటీవల కొందరు రౌడీషీటర్లు శాంతిభద్రతలకు భంగం కలిగే విధంగా ప్రవర్తిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అటువంటి రౌడీషీటర్లను నగర బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు.

నేడు మహిళా మార్ట్ ప్రారంభం

పెడన: వెలుగు ఆధ్వర్యంలో పెడన పట్టణంలో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్ట్‌ను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ సోమవారం ఉదయం ప్రారంభిస్తారని వెలుగు ఏపీఎం శ్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన ఈ మహిళా మార్ట్‌లో అన్నిరకాల సరుకులు, వస్తువులు విక్రయిస్తారని చెప్పారు. మహిళా మార్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రి జోగి రమేష్‌తో పాటు ఎంపీ బాలశౌరి, జిల్లా కలెక్టర్ రాజాబాబు తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



టి.కొత్తపాలెం(నాగాయలంక): గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్వో ప్లాంట్‌ను స్థానిక సర్పంచ్ బండ్రెడ్డి శివపార్వతి ఆదివారం ప్రారంభించారు. ఈ పథకం కోసం గ్రామస్తులైన కీ.శే రేమాల అంజయ్య, నారాయణమ్మ జ్ఞాపకార్థం అమెరికాలో నివశిస్తున్న వారి కుమారుడు రేమాల వెంకటేశ్వరరావు, సత్యకుమారి దంపతులు రూ.14 లక్షలు వితరణ చేశారు. ఈ సందర్భంగా దాత బంధువులు, సర్పంచ్‌ను గ్రామస్తులు సన్మానించారు.

అమ్మవారికి 108 చీరలతో అలంకరణ



టేకుపల్లి(మోపిదేవి): మండల పరిధి టేకుపల్లిలోని బాల పార్వతి సమేత రామేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం పార్వతి అమ్మవారిని 108 చీరలతో అలంకరించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నూతన వస్త్రాలు (చీరల)తో అలంకరించారు. శ్రావణమాసం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశామని ఆలయ కమిటీ తెలిపింది. భక్తులు స్వామివారు, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సీపీఎం శిక్షణ తరగతులు ప్రారంభం

ఉంగుటూరు: మండలంలోని పెదఅవుటపల్లి లో సీపీఎం గన్నవరం నియోజకవర్గస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం ప్రారంభించారు. తొలుత పార్టీ సీనియర్ నాయకులు భీమవరపు సుబ్బారెడ్డి పార్టీ జెండా ఆవిష్కరించారు. సుందరయ్య చిత్ర పటానికి మహిళా నాయకులు కె.జ్యోతి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు మాట్లాడారు. జిల్లా కార్యదర్శి ఆర్.రఘు, సీపీఎం నాయకులు కళ్లం వెంకటేశ్వరరావు, అజ్మీర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

- పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- జుఝువరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

జుఝువరం(పామర్రు): సమాజంలో పేదరికాన్ని నిర్మూలించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టారని పామర్రు శాసన సభ్యులు కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని జుఝువరం గ్రామంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు తిరిగి వారికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా ఆయా లబ్ధిదారులకు సమకూరిన లబ్ధిని వివరించారు. బుక్‌లెట్లను అందజేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు అభివృద్ధి చెందితే ఆ రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని నమ్మిన వ్యక్తి సీఎం జగన్ అన్నారు. పేద రిక నిర్మూలనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పేదల పక్షపాతిగా పేరు తెచ్చుకున్నారని అన్నారు. ఏపీలో అమలు చేస్తున్న ఎన్నో సంక్షేమ పథకాలు పేదలు తలెత్తుకు తిరిగే విధంగా చేస్తున్నాయని అన్నారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేసినట్లు పేర్కొన్నారు. గడప గడపలో ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని అన్నారు. జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 99 శాతం మేర నెరవేర్చిన ఘనత మన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. నిత్యం ప్రజల కోసం కష్ట పడే నాయకుడు జగన్ అని ఇటువంటినాయకుడుని మళ్లీ మనం ముఖ్యమంత్రిగా చేసుకోవాలని అన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల మత ప్రాంత పార్టీ విభేదాలు లేకుండా అర్హులైన ప్రతి పేద వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, రెడ్డిక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కంభపు రాంబాబు, స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, మండల ఆర్బీకే అధ్యక్షుడు ముప్పిడి సురేష్ రెడ్డి, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ పీ పున్నమ్మ, పార్టీ నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, పీ రామకృష్ణ, పుట్టి కిషోర్, కె. ఆంజనేయులు, చిన్నం శ్రీనివాసరావు, పెయ్యల రాజు, నామా వెంకటేశ్వరరావు, తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, ఎంపీడీవో వై.రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ జాతర



గంగానమ్మ ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



గంగానమ్మ జాతర ముగింపు కార్యక్రమంలో దూలం శ్యామ్ ఫణికుమార్

పామర్రు: గంగానమ్మ పోతురాజుల జాతర గ్రామోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బందరు రోడ్డులోని లాకు బజారులో ఉన్న గంగానమ్మ తల్లి, పోతురాజు గడలను స్థానికులు భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం వైభవంగా చేశారు. డప్పువాయిద్యాలతో మేళ తాళాలతో గ్రామంలోని పురవీధుల వెంబడి అమ్మవారిని ఊరేగించారు. చిన్నారులు, పెద్దలు చిందులు వేస్తూ ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా జాతర మహోత్సవంలో పాల్గొన్నారు. ఊరేగింపులో ప్రజలు అమ్మవారికి చద్ది నివేదనలు, హారతులు ఇచ్చారు. ఆలయంలో భక్తులు అమ్మవారికి వేడి నివేదనలను సమర్పించి, మొక్కుబడులను తీర్చుకున్నారు. రజక సంఘ పెద్దలు, నాయకులు, యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పమిడిముక్కల: స్థానిక గంగానమ్మ తల్లి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో గంగానమ్మ జాతర మహోత్సవాలు వైభవంగా జరిపారు.

కైకలూరు: స్థానిక బైపాస్ రోడ్డులో ఈ నెల 6న ప్రారంభమైన గంగానమ్మ జాతర ఆదివారంతో ముగిసింది. చివరి రోజు అమ్మవారికి నైవేద్యాలు సమర్పణ, గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి గుడి వద్ద గరక డప్పులు, మేళతాళాలు, తీన్‌మార్‌తో సందడి వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కుమారుడు శ్యామ్ ఫణికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు చేశారు. నిర్వాహకులు తులసి పూర్ణ, నిమ్మల సాయి, నరసింహారావు, సుబ్బారావు, ఫణి, చిన్నా, శ్యామ్, మణి పాల్గొన్నారు.

బాల వికాస్ కేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న సేవా సమితి అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్‌రావు

పామర్రు: ప్రతి ఒక్కరికీ లౌకికమైన విద్య, మానవత విలువలు పెంపొందించటమే బాల వికాస్ కేంద్రాల ముఖ్యలక్షణమని కృష్ణా జిల్లా సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్ రావు అన్నారు. స్థానిక కోటిరెడ్డి పేటలో కోటి నాగ మహేశ్వరరావు, దుర్గా నాంచారమ్మ దంపతుల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బాలవికాస్ కేంద్రాన్ని ఆయన ఆదివారం ఘనంగా ప్రారంభించారు. తొలుత పుట్టపర్తి సాయిబాబాకు విశేషంగా పూజలు నిర్వహించారు. చిన్నారులు నిర్వహించిన కోలాట ప్రదర్శనలు అలరించాయి. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన 'నమామి శత రుద్రీయం' కార్యక్రమం స్థానిక ప్రగతి కళా శాలలో ఉదయం 5గంటలకు 2 వేల మందితో నగర సంకీర్తనతో ప్రారంభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 108 శివలింగాలకు సామూహికంగా అభిషేకం చేసుకునే విధంగా ఏర్పాటు చేశామన్నారు. అనంతరం 2 వేల మొక్కలను కళాశాల ఆవరణలో నాటాలని, ప్రతి ఒక్కరూ ఈకార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈనెల 26న జిల్లా వ్యాప్తంగా 'ఆచార్యదేవోభవ' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 50 బాల వికాస కేంద్రాలను పలు చోట్ల ఏర్పాటు చేశామని, పామర్రులో 51వ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పూర్ణచంద్రరరావు, మోహన్‌రావు, జగన్‌నిహారి, పెదపూడి సుబ్రమణ్యం, సాయిజ్యోతి, ఆంజనేయులు, దుర్గా, మహేష్, మురళి కృష్ణలు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ షేక్ ఖాజాకు సత్కారం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఏపీ వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్‌గా ముతవల్లీ కోటాలో జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన షేక్ ఖాజాను ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, ముస్లిం మత పెద్దలు ఆదివారం ఘనంగా సత్కరించారు.
సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ముస్లిం మైనార్టీల పెద్దలు అధిక సంఖ్యలో ఖాజాకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి అభినందించారు.
వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు ఎండీ హఫీజుల్లా, షేక్ అమిత్, షేక్ వెంకట్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు చింతా శ్రీను, కంభగల రాజు, ముస్నీ, అబ్జల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

దత్తసాయి శివకామేశ్వరి పీఠంలో ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఆదివారం శ్రీ ధర్మపరిషత్ మహాసంస్థాన్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. ఆలయంలోని శ్రీ శివకామేశ్వరికి శ్రావణ మాసం పురస్కరించుకుని కుంకుమార్చనలు, శ్రీచక్రార్చన, చండీ హోమం జరిగింది. నీలకంఠేశ్వరుడికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.